



పోలీస్ అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

దివ్వెల.. దీపావళి

- అంతటా దీపావళి సందడి
- అప్రమత్తతతోనే ఆనందమయం
- బాణసంచా కొనుగోళ్ల కోలాహలం



గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్వెల వెలుగు జిలుగుల పండుగ దీపావళి. దీపకాంతులతో ఇంటిని అలంకరించి అందరూ ఆనందంగా జరుపుకునే శుభదినం. దీపావళి జీవితాల్లో వెలుగులు తెస్తుందని అందరి విశ్వాసం. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా.. అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. విజయపు వెలుగుల్ని అందరికీ పంచే వేడుక ఇది. జిల్లాలో సోమవారం నరక చతుర్థి(దీపావళి) ని వైభ వంగా జరుపుకునేందుకు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సిద్ధమయ్యారు. పట్టణాలు.. పల్లెల్లో దీపావళి సందడి నెలకొంది. సోమవారం మహాలక్ష్మీ పూజకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇళ్లు, వ్యాపార సంస్థలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించు కుంటున్నారు. మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగించి ఇళ్లను అలంకరించేందుకు మహిళలు సిద్ధమయ్యారు. మట్టి ప్రమిదలు.. బాణసంచా విక్రయాలకు ఎక్కడికక్కడ అధికారులు ఏర్పాట్లు చేశారు. బాణసంచా విక్రయాలకు అధికారులు ప్రత్యేకంగా లైసెన్సులు మంజూరు చేశారు. గ్రామాల్లో సైతం టపాకాయల దుకాణాలు నెలకొన్నాయి. ఆయా దుకాణాల వద్ద ఆదివారం సాయంత్రం నుంచి కొనుగోళ్ల సందడి నెలకొంది. బాణసంచా ధరలు అధికంగా ఉన్నాయని కొనుగోలుదారులు తెలిపారు.



గుంటగ్రౌండ్‌లో కొనుగోళ్ల కోలాహలం



అప్రమత్తత అవసరం..

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు గా జరుపుకునే దీపావళి పండుగలో టపాసులది ప్రధాన పాత్ర. రంగు రంగుల కాంతులతో కను విందు చేస్తూ.. భారీ శబ్దాలు చేసే టపాకా యలను కాల్చేందుకు చిన్నారులతో పాటు పెద్దలు కూడా ఇష్టపడతారు. అయితే బాణసం చా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వినోదం కాస్తా విషాదంగా మారుతుంది. ఈ పరిస్థితుల్లో అప్రమత్తతతో దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు బాణసంచా కాల్చేట ప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు శాఖల వారీగా అధికారులు అవ గాహన కల్పించారు.

టపాకాయలతో ప్రయోగాలొద్దు

టపాసులు కాల్చేటప్పుడు కొన్ని పేలకుండా ఆగిపోతాయి. అలాంటి వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం వంటివి చేయకూడదు. వాటిని తిరిగి వెలిగించాలనే ప్రయత్నం చేయకూడదు. అలాంటి వాటిపై నీరు పోయడం మంచిది. తారాజువ్వలు, రాకెట్లు వంటి వాటి వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్ర మత్తంగా ఉండాలి. ఎక్కడైనా ప్రమాదం సంభ విస్తే 101, 100, 108 నెంబర్లకు సమాచారం అందించాలి.

కొనుగోళ్ల సందడి

అధికారికంగా, అనధికారికంగా పెద్దఎత్తున ఎక్కడికక్కడ బాణసంచా విక్రయ దుకాణాలు వెలిశాయి. ఆకాశం మేఘావృతమై ఉన్నా ఆది వారం సాయంత్రం నుంచి కొనుగోళ్ల సందడి నెలకొంది. టపాకాలయ కొనుగోళ్లకు పిల్లలు పెద్దలతో తరలిరావడంతో పట్టణాల్లో కోలాహల వాతావరణం నెలకొన్నది. ఆదివారం శెలవు ది నం కావడంతో ప్రజలు పూజాసామగ్రి కొను గోళ్లకు ఉత్సాహం చూపారు. గృహాలను అలంక రించేందుకు ఉపయోగించే ప్రమిదలు రకరకాల రంగులతో పాటు వివిధ ఆకృతుల్లో ఆకర్షించేలా అందుబాటులో ఉంచడంతో వాటిని కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు. ప్రమిద లతో పాటు కొవ్వొత్తులను కొనుగోళ్ళు చేశారు. ఇక దీపావళి పండుగకు పూజా సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. బంతిపూలు మూర రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయించారు.

రేపు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- మంగళగిరి బెటాలియన్‌లో కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- రిహార్సల్ పరేడ్‌ను పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో మంగళవారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం జరగ నున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ క్రమంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ ఇతర అధికారులతో కలసి ఆదివారం పరిశీలించారు. రిహార్సల్ పరేడ్ నిర్వహించగా, కార్యక్రమంలో డీఐజీ ఫకీరప్ప కాగినేల్లి, మల్లికాగార్గ్, సరిత తదితరులు పాల్గొని, పరిశీలించి పలు సూచనలు చేశారు. రిహార్సల్ సమ యంలో వీవీఐపీ, వీఐపీ లకు ఆహ్వానం అందించే విధానం, పోలీస్ గౌరవ వంద నం సమర్పణ తీరుతెన్నులు, అమరవీ రులకు పుష్పాంజలి అర్పించే విధానం, పరేడ్ సమన్వయం, ఫొటోగ్యాలరీ వీక్షణ తదితర అంశాలను అధికారులు పరిశీలిం చారు. ప్రధాన కార్యక్రమానికి విచ్చేసే వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాల్లో బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సభా ప్రాంగణంలో వారిని గౌరవించి ఆహ్వానించడానికి కేటాయించిన అధికా రుల విధులను ఎస్పీ సమీక్షించారు. కార్య క్రమంలో ఏఎస్పీలు రమణమూర్తి, ఏటీవీ రవికుమార్, సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



అల్లుడి కిడ్నాప్‌కి యత్నించిన అత్త

అట్రాసిటీ కేసులపై అధికారుల నిర్లక్ష్యం

- కమిషన్ చెప్పినా పట్టించుకోవడం లేదు
- సీఎస్‌ను కలుస్తామన్న చైర్మన్ కేఎస్ జవహర్

ఐక్యతతోనే లక్ష్యాల సాధన

- ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేశ్
- అట్టహాసంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రశాఖ కార్యవర్గ ప్రమాణం

6






కార్తీక అభిషేకాలకు ఏర్పాట్లు

- కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి సిద్ధం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కార్తీక మాసానికి కోటప్పకొండ శ్రీత్రి కోటేశ్వరస్వామి సన్నిధి ముస్తాబవు తోంది. ఆలయానికి తరలి వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈవో చంద్ర శేఖరరావు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షిస్తు న్నారు. కార్తీక మాసంలో త్రికోటేశ్వరస్వా మికి అభిషేకం చేయడం వల్ల సర్వదోష ని వారణ, సర్వకార్య సిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాసంలో త్రికోటేశ్వరస్వామికి విశేష అభిషే కాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పరోక్షంగా స్వామి అభిషేక పథకంలో పాల్గొనేందుకు రూ.1,000 టిక్కెట్ చెల్లించాల్సి ఉంది. ఈ పథ కంలో చేరితే ప్రతి రోజు స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ పథకంలో చేరిన సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తారు. కార్తీకమాసం అనంతరం స్వామి ప్రసాదం, శేషవస్త్రం కొరి యర్ ద్వారా సభ్యులకు అందజే స్తారు. ఆది, సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో మాత్రం మూల విరాట్ అభిషేకానికి భక్తులను అనుమతించరు. ఆయా రోజుల్లో అభిషేక మండపంలో అభి షేకాలకు ఏర్పాట్లు చేశారు. రూ.500 అభిషేకం టిక్కెట్‌పై ఇద్దర్ని అభి షేకానికి అనుమతిస్తారు. స్వామి దర్శనానికి క్యూలు ఏర్పాటు చేస్తున్నా రు. ఉచిత దర్శనంతో పాటు రూ.100 స్పెషల్ దర్శనాలకు కూడా ఏర్పాట్లు చేశారు. ఆల యంలో మధ్యాహ్నం 12:30 నుంచి 2.30 గంటల వరకు అన్నపూర్ణ సత్రంలో అన్నదానం చేస్తారు. ప్రతి గురువారం యాగశాలలో నిర్వహించే మేధాదక్షణామూర్తి హోమంలో పాల్గొన దలచిన భక్తులు రూ.2,116 చెల్లిస్తే హోమానికి కావాల్సిన పూజా సామగ్రిని దేవస్థానం అందజేస్తుంది. స్వామి దర్శనం అనంతరం భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో ఉన్న పర్యాటక కేంద్రాన్ని సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను కొండపైకి ఏర్పాటు చేశారు.








అల్లుడి కిడ్నాప్‌కి యత్నించిన అత్త


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లుడిని కిడ్నాప్ చేయించేందుకు యత్నించిన అత్త పోలీసులకు చిక్కింది. ఈ ఘటన తెనాలి చంద్రబాబు నాయుడు కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ సాంబశివరావు వివరాల మేరకు.. సీఎం కాలనీలో నివాసం ఉండే మణికంఠకి వినుకొండలోని దూరపు బంధువుల అమ్మాయి లిఖితతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె ఉంది. ప్రస్తుతం మణికంఠ భార్య 8 నెలల గర్భిణి. అయితే వివాహ అనంతరం అత్త ప్రవర్తన నచ్చక అతను భార్యను పుట్టింటికి పంపించలేదు. దీనికి భార్య కూడా తల్లిపై అయిష్టత చూపింది. దీంతో తన అల్లుడిని చంపి అయిన సరే తనతో పాటు కూతురిని తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో శనివారం రాత్రి అత్త విజయలక్ష్మి కారులో నలుగురు యువకులు తీసుకుని వెళ్లింది. ఆమెతో పాటు వినుకొండకు చెందిన మల్లెల వేణుగోపాల్, ఇంటూరు డొంక రోడ్డుకు చెందిన నక్కా కిరణ్, తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన బండారు యశ్వంత్ వర్ధన్, పిడుగురాళ్ల జానపాడు రోడ్డుకు చెందిన బత్తుల కోటేశ్వరరావు ఉన్నారు. వీరందరూ రాత్రి 10.30 గంటలకు మణికంఠ ఇంటికి వచ్చి బలవంతంగా అతనిని కారులో ఎక్కించుకుని, గుంటూరు వైపు తీసుకెళ్తున్నారు. బంధువులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఎస్ఐ కరిముల్లా తన సిబ్బందితో కలిసి కారును చేజ్ చేసుకుంటూ వెళ్లారు. శేకూరు వద్దకు చేరుకోగా అక్కడ మణికంఠపై నిందితులు కర్రలతో దాడి చేస్తుండగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు విషయంలో వేగంగా స్పందించిన ఎస్ఐ కరిముల్లా, కానిస్టేబుళ్లు మురళి, చిన్న, బాబును డీఎస్పీ బి.జనార్దనరావు అభినందించారు.

దిగువకు 42,600 క్యూసెక్కులు


బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 50,570 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 11.4 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 42,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 3,276, పశ్చిమ డెల్టాకు 4,513, గుంటూరు చానల్‌కు 151 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనుమతి ఉండే ఇలా అమ్ముతున్నారా!

- జోరుగా అనధికార బాణసంచా విక్రయాలు
- అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలా నివారిస్తారు?
- పట్టించుకోని పోలీసు, మునిసిపల్, అగ్నిమాపక శాఖ అధికారులు


పట్టాభిపురంలో అనధికారికంగా వెలిసిన బాణ సంచా దుకాణం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనధికార బాణసంచా విక్రయ దుకాణాలు ప్రధాన రోడ్ల పక్కన వెలిశాయి. వాణిజ్య ప్రాంతాలు, నివాసాల పక్కన రోడ్లపై షామియానాలు వేసి, తోపుడు బండ్లపై గుట్టలుగా టపాసులు పోసి విక్రయాలు జరుపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎవరినీ రోడ్లపై బాణ సంచా విక్రయాలు చేపట్టకుండా పర్యవేక్షించిన పోలీసు, మునిసిపల్, పంచాయతీ, అగ్నిమాపక శాఖల అధికారులు ఏ కారణంతోనే పట్టు సడలించారు. దాంతో పట్టణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోనూ బాణ సంచా అమ్మకాలు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయి.

అనుమతుంటే..రక్షణ ఉన్నట్లే!

అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయాలను అనుమతించబోమని పది పదిహేను రోజులుగా అధికారులు చెబుతున్నారు. దుకాణాలు ఏర్పాటుకు దరఖాస్తు పెట్టుకోవాలని ఆదేశించారు. దాంతో చాలామంది ఖాళీ ప్రదేశాలను చూసి.. అక్కడ షాపుల అనుమతుల కోసం నిర్ణీత ఫీజులు చెల్లించారు. వాటిని వివిధ శాఖల అధికారులు పరిశీలించి ఎన్‌వోసీ ఇచ్చిన తర్వాత బాణ సంచా విక్రయాలకు అనుమతించారు. గుంటూరు నగరంలో చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్స్, స్వామి థియేటర్, ఏసీ లా కాలేజ్, గుంట గ్రౌండ్, రింగు రోడ్డులోని డాన్‌బాస్కో తదితర ప్రాంతాల్లో బాణ సంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. ఇవి కాక ఏడాది పొడవునా టపాసులు విక్రయించే దుకాణాలు చుట్టుగుంట, పెద్దపులి వీధి, ఏటుకూరు రోడ్డు, పెదకాకాని జంక్షన్, నారాకోడూరు, చేబ్రోలు, మంగళగిరి వద్ద ఎన్‌హెచ్-5 పక్కన తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. వీటి వద్ద ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ ఫైటింగ్ పరికరాలున్నాయి.

తప్పుజరిగితే..బాధ్యులు ఎవరు?

సోమవారం మరిన్ని ప్రాంతాల్లో అనధికార దకాణాలు ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాలామంది నెల ముందుగానే హోల్‌సేల్ దుకాణాలు, తమిళనాడుకు వెళ్లి బాణ సంచా కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇళ్లల్లో నిల్వ చేశారు. కొందరైతే గత ఏడాది మిగిలిపోయిన వాటిని సేల్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఏదైనా ప్రమాదం జరగనంత వరకు అంతా బాగానే ఉంటుంది. జరగరానిది జరిగితే అప్పుడు యంత్రాంగం వైఫల్యం అంటూ అధికారులు/ఉద్యోగులను బాధ్యులుగా చేసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు, మునిసిపల్, పంచాయతీరాజ్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

22 నుంచి ఎస్‌ఆర్‌ఎంలో..

అమరావతి సాహిత్య ఉత్సవం

తుళ్లూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి ఏపీ ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో అమరావతి సాహిత్య ఉత్సవం జరుగనుంది. మూడ్రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రముఖ కవులు, సాహితీవేత్తలు, విమర్శకులు, వివిధ రంగాల విద్యావేత్తలు, భాషా ప్రముఖులు పాల్గొంటారు. యూనివర్సిటీలోని భాషా సాహిత్య విభాగం అధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. వర్సిటీ యాజమాన్యం ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. భాషా సాహిత్య రంగాల్లో నిష్ణాతులైన కవులు, సాహితీకారులు, విద్యావేత్తలు, విమర్శకులను ఒకే వేదికపైకి తీసుకు రావడంతో పాటు వివిధ భాషలను ప్రోత్సహించడం ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆమ్లాన్ బైశ్యా పేర్కొన్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ప్రముఖ తెలుగు స్త్రీ వాద రచయిత్రి పి.లలితకుమారి (ఓల్గా), పద్మశ్రీ గణేష్ ఎన్.దేవి, పి.సత్యవతి, రమేష్ కార్తీక్, కడలి సత్యనారాయణ వంటి సాహిత్య రంగ ప్రముఖులు ఉత్సవాలకు హాజరవుతున్నారు. 24న ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి కుమారి కోకా విజయలక్ష్మి బృందం తెలుగు ప్రశస్తి నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారని తెలిపారు.

వీరాంజనేయ స్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి


ప్రత్యేక పూజలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్

పొన్నూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని మహిమాన్విత పుణ్యక్షేత్రం వీరాంజనేయ స్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ తుహిన్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. నాగవల్లి దళార్చనలో న్యాయమూర్తి పాల్గొన్నారు. జస్టిస్ తహీన్ కుమార్‌కు ఆలయ పాలకమండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా, ఈవో గద్దె అమర్నాథ్ స్వామి జ్ఞాపికను, శేష వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

సూర్యలంక తీరానికి..

బాపట్ల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్ర తీరానికి హైకోర్టు జడ్జి జస్టిస్ తుహిన్‌కుమార్ విచ్చేశారు. ఆయనకు ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం ఆయన హరితా బీచ్ రిసార్ట్స్‌లో విడిది చేశారు.

అట్రాసిటీ కేసులపై అధికారుల నిర్లక్ష్యం

- కమిషన్ చెప్పినా పట్టించుకోవడం లేదు
- సీఎస్‌ను కలుస్తామన్న చైర్మన్ కేఎస్ జవహర్



జవహర్ దంపతులను సత్కరిస్తున్న నక్కా ఆనంద్‌బాబు, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ఎమ్మెల్యేలు బూర్ల, మాధవి తదితరులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కొంతమంది పోలీసులు, అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ చెప్పినా ఇదే వైఖరిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే సీఎస్‌ను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. జవహర్ మిత్రమండలి ఆధ్వర్యంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి అధ్యక్షతన కేఎస్ జవహర్ దంపతులకు గుంటూరు ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ జీవో నెంబరు 19తో ఉద్యోగోన్నతులు, బదిలీల్లో ఎస్సీ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలవనున్నట్లు చెప్పారు. తొలి ప్రాధాన్యం ఆత్మగౌరవమని.. ఆ తర్వాతే పదవులన్నారు. దళితులపై దాడులు, భూ ఆక్రమణలపై త్వరలో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి జస్టిస్ పున్నయ్య 42 ప్రతిపాదనలు ప్రతిపాదిస్తే వాటిని చంద్రబాబు ఆమోదించి, అమలుకు సుమారు 15 జీవోలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేలు రామాంజనేయులు, గళ్లా మాధవి మాట్లాడుతూ విశేషాధికారాలను ఉపయోగించి దళితులకు కమిషన్ సమగ్ర న్యాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌బాబు, నాయకులు మేడిద బాబురావు, సుదర్శి ప్రకాష్ కుమార్, కూచిపూడి సత్యం, పాటిబండ్ల బాలయ్య, రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అమరావతిలో అన్ని బ్యాంకుల కేంద్ర కార్యాలయాలు

- ఏఐబీవోసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్


సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రవికుమార్

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కేంద్ర కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి బ్యాంకులకు రాజధానిలో స్థలాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో బ్యాంకులు తమ కేంద్ర కార్యాలయాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నాయని వివరించారు. సీఎం స్పందిస్తూ.. అమరావతి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే స్మార్ట్ క్యాపిటల్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని, అమరావతి నిర్మాణంలో సైతం భాగస్వామ్యం కావాలని కోరారు. తెలుగువారు జాతీయ స్థాయిలో బ్యాంకింగ్ రంగంలో కీలక పదవుల్లో విశేష గుర్తింపు తెచ్చుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని అభినందించారు. అమరావతిలో నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ సేవలు బ్యాంకింగ్ రంగానికి ఎంతో ఉపయోగపడుతాయని, ఈ దిశగా క్వాంటమ్ సేవలు అన్ని బ్యాంకులు వినియోగించుకుని ప్రజలకు మరింత చేరువవ్వాలని ఆకాంక్షించారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

- రాష్ట్ర బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు


నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యవర్గం

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో కూడా బీసీ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీఈఎఫ్‌ను ప్రభుత్వం గుర్తింపునకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉద్యోగులు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ద్వితీయ మహాసభలో ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సభకు రాష్ట్ర మహాసభ పూర్వాధ్యక్షుడు శివ పూర్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగులలో సగానికి పైగా భాగంలోనే బీసీలు ఉన్నారని, వీరందరికీ కూడాను ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం గౌరవ అధ్యక్షులుగా పీవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్ట భాస్కర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోట హరిబాబు, ఉండవల్లి శ్రీనివాసరావు. ఆర్థిక కార్యదర్శిగా వరికల్లు శ్రీనివాసరావు, మరో ఐదుగురు ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఐక్యతతోనే లక్ష్యాల సాధన

- ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేశ్
- అట్టహాసంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రశాఖ కార్యవర్గ ప్రమాణం


ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

మంగళగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే ఏ లక్ష్యాన్ని అయినా సాధించ వచ్చని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తెలిపారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఆదివారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రశాఖ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవం పెరిగేవిధంగా ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. మహాత్మగాంధీ, పొట్టి శ్రీరాములు వంటి మహానుభావుల బాటలో పయనిస్తూ తమ వర్గం సంక్షేమంతోపాటు మొత్తం సమాజం బాగుకోసం పనిచేయాలన్నారు. తిరుపతిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ భూములను అన్యాక్రాంతం చేసేందుకు ఇటీవల కొన్ని దుష్టశక్తులు కుట్ర పన్నాయని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను సామాజికవర్గం ఐక్యతతో అడ్డుకోవాలన్నారు. విజయవాడలో ప్రపంచ ఆర్యవైశ్య సదస్సును నిర్వహించాలన్న ఆలోచన ఉందన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజానికి ఆదర్శంగా నిలిచేలా తమ వ్యక్తిత్వాన్ని మలుచుకోవాలని కోరారు.

ప్రమాణ స్వీకారం..

ప్రపంచ ఆర్యవైశ్యమహాసభ రాష్ట్రశాఖ అధ్యక్షులుగా మంగళగిరికి చెందిన దేవతి భగవన్నారాయణతో పాటు కార్యవర్గం చేత ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, అంబికా దర్బార్ బత్తి అధినేత అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, తాళ్లాయపాలెం శైవక్షేత్రం నిర్వాహకులు శివస్వామి, బీజేపీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు వంశీకృష్ణ, శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మాజేటి సూర్యవేణు గోపాలకృష్ణ, ఇల్లూరు లక్ష్మయ్య, కనమర్లపూడి హరిప్రసాదరావు, నూకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ శనక్కాయల రాజకుమారి, సిబ్బంది, విద్యార్థులు

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● డాక్టర్ శనక్కాయల రాజకుమారి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ శనక్కాయల రాజకుమారి సూచించారు. ఆదివారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ శనక్కాయల అరుణ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న కుమారి, వార్డెన్ అనూషా, ఎన్ఎస్ఎస్ అధికారి ధాత్రి కుమారి, శుభరత్నం, ఎన్‌సీసీ అధికారి లత, అనూషా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక సేవలు సులభతరానికే పురమిత్రా యాప్

● ప్రజలు డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి ● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నగర ప్రజలకు పురపాలక సేవలను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటివి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులతో పాటు ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. వీధి దీపాలు, చెత్త పేరుకుపోవడం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అంశాలపై ఫిర్యాదులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవడానికి ట్రాకింగ్ కూడా ఉంటుందన్నారు. ఫిర్యాదులు, సేవల పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉంటుందన్నారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, డ్రైనేజీ చార్జీలు, ఆస్తి పన్ను మ్యూటేషన్ ఫీజు, షాప్ లీజులు, అగ్రిమెంట్ ఫీజులు, ప్రకటనల పన్నులను యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే వారం నుంచి వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలకు యాప్ డౌన్లోడ్, వినియోగంపై అవగాహన కల్పిస్తామని కమిషనర్ ప్రకటించారు.

నేడు జీఎంసీలో పీజీఆర్ఎస్ రద్దు

దీపావళి పండుగ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం లేదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.



దేగల ప్రభాకర్‌ను సత్కరిస్తున్న స్వింగ్స్ అండ్ వింగ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వైద్యుల సూచనలే ఆరోగ్యానికి రక్ష

● ఐడీఎస్ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్రప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ దేగల ప్రభాకర్ సూచించారు. ఆదివారం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ ఆవరణలో స్వింగ్స్ అండ్ వింగ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, ఈసీజీ, వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి వైద్యులు సూచనలు అందించారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ మాట్లాడుతూ, వైద్యుల సూచనలు పాటించకపోవడంతో చాలా మంది ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే సరైన వైద్యం అందుతుందని వివరించారు. ఆరోగ్యానికి వాకింగ్, యోగా వంటి ప్రక్రియలను పాటించాలన్నారు. అనంతరం స్వింగ్స్ అండ్ వింగ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు దేగల ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యర్రగోపు నాగేశ్వరరావు, మేకల బాబురావు, నరసింహారావు, దవాలాయి సుబ్రహ్మణ్యం, రాగం సదాశివరావు, శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి పర్వదినం సందర్భంగా సోమవారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు గానీ, డీఎస్పీని గానీ సంప్రదించాలని సూచించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు సహకరించాలని కోరారు.

సంపూర్ణ వైద్య విధానమే ఆయుర్వేదం

● డాక్టర్ శివకల్యాణ్

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ వైద్య విధానమే ఆయుర్వేదమని, దీనిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ శివకల్యాణ్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకల్యాణ్ మాట్లాడుతూ, ఆయుర్వేదం భారతదేశానికి చెందిన సంపూర్ణ వైద్య విధానమని, ఇది ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించటంపై దృష్టి పెడుతుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా చికిత్స చేస్తుందని, వ్యాధుల సాధ్యాసాధ్యతలను చికిత్సతో ప్రభావితం చేయవచ్చనేది ఆయుర్వేద దృక్పథమని తెలిపారు. చికిత్స లేదనుకొని ఆశ వదిలేసుకున్న అనేక మందికి ఆయుర్వేద వైద్య విధానంతో స్వస్థత చేకూరిందన్నారు. ఆయుర్వేదం అనేది ఆయుష్షును, జీవితాన్ని గూర్చి వివరించే శాస్త్రమని, ఆరోగ్య అవగాహనకు, వైద్యపరమైన చైతన్యానికి అవసరమైన ఎన్నో మార్గదర్శకాలు ఆయుర్వేద వైద్య విధానంలో ఉన్నాయన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, వీవీ రావ్, అచ్యుత ఇందుశేఖర్, చలమారెడ్డి, ఆర్.వెంకటరత్నం తదితరులున్నారు.

టైమ్ పాస్ కోసమే కోటి సంతకాలు : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'టైమ్ పాస్ కోసమే వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టిందని మెమ్మెల్యే నసీర్ అన్నారు. లిక్కర్ స్కామ్ బయటపడిందనే సాకుతో డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. మైనింగ్ రంగంలో వడ్డేరలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించడంపై ఆదివారం ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో వడ్డేర సంఘ నాయకులు స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ, వడ్డేరల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా అండగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలు రాజకీయ అవకాశాలు కోల్పోయారని గుర్తుచేశారు. దేశమంతా పీపీపీ విధానంతోనే అభివద్ధి పథంలో పయనిస్తుంటే, వైసీపీ మాత్రం దానికి విఘాతం కలిగిస్తోందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల నిర్మాణం ద్వారా పేదలకు సీట్లు లభిస్తాయని, అది వైసీపీ ఓర్చుకోలేకపోతోందని విమర్శించారు. ప్రజలు తిరస్కరించినా వైసీపీకి బుద్ధి రాలేదని నసీర్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వడ్డేర సంఘం నేతలు దేవల్ల వెంకట్, చల్లా ఆంజనేయ ప్రసాద్, నగాల సుజాత, పెనుగొండ భాస్కర్, తన్నీరు సాంబయ్య, చల్ల నాగరాజు, ప్రసాద్, బత్తుల శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, వడ్డెర సంఘం నేతలు

ప్రజా ప్రయోజకర పనులు వెంటనే చేపట్టండి

వినియోగంలోలేని మంచినీటి బావుల ప్రదేశాలను ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాలకు వినియోగించాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు వైండింగ్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జాలయ్య కాంప్లెక్స్, టైర్ మార్కెట్ కాంప్లెక్స్, రాజారాం కాంప్లెక్స్‌ల రీమోడలింగ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బాలాజీనగర్, ఐపీడీ కాలనీ, నెహ్రూనగర్ తోపాటు నాజ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు 60 అడుగుల నుంచి 80 అడుగులు రోడ్డు విస్తరణపై చర్చించారు. మణిపురం బ్రిడ్జి సర్వీస్ రోడ్డు కోసం లిడ్ కార్పొరేషన్ నుంచి ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌తోపాటు అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు.

'కందుకూరు హత్య' బాధితులకు హోం మంత్రి అనిత పరామర్శ

- గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్, భార్గవ్
- రూ.5 లక్షలు సాయం అందజేత

గుంటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలోని దారకానిపాడులో జరిగిన దారుణ ఘటనలో తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్యకు గురికాగా, ఆయన ఇరువురు సోదరులు తిరుమలశెట్టి పవన్, భార్గవ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి హోం మంత్రి అనిత.. ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, కన్నా లక్ష్మీనారాయణలతో కలిసి ఆసుపత్రిలో వారిని పరామర్శించారు. వారి తండ్రి శ్రీనివాసరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. పవన్, భార్గవ్‌లకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితి గురించి సంబంధిత వైద్యులను అడిగారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.రెండున్నర లక్షల చొప్పున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, కన్నా లక్ష్మీనారాయణ

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. 44వ డివిజన్లో జనసేన నేత వెంకీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, 50 సంవత్సరాలు పైబడినవారిలో చాలామందికి కంటి సమస్యలు వస్తుంటాయని అలాంటివారికి ఉపయోగపడే విధంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కంటి వైద్యరంగంలో శంకర్ కంటి ఆసుపత్రి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, మాణిక్యాలరాజ్, విజయలక్ష్మి, పద్మలత, శంకర్ కంటి వైద్యులు స్థానిక నేతలు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షా కేంద్రంలో ఎమ్మెల్యే గల్లా మాధవి

హేతువాద సాహిత్య పితామహుడు త్రిపురనేని

కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు..

త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి. లక్ష్మీ నరసయ్య అన్నారు. గుంటూరు సీపీఎం కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావు అధ్యక్షతన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణల ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారాలు అందజేయడం సముచితమని అన్నారు. సభలో మరో ముఖ్యఅతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించింది రామస్వామి అని గుర్తుచేసుకున్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలను ప్రదానం చేసి వారిని ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరీ సుధ తదితరులు ప్రసంగించారు.



ఆలా వెంకటేశ్వర్లుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు



చిగురిస్తున్న ఆశలు..

- తిరిగి జీవం పోసుకుంటున్న నిర్మాణాలు
- తరలివచ్చిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం
- త్యాగమూర్తుల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు
- రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై దృష్టిసారించిన సీఆర్డీఏ

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పటి వరకూ ఒకలెక్క.. ఇక నుంచి ఒక లెక్క అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. రాజధాని నిర్మాణంలో కీలక భూమిక పోషించే ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలిరావడంతో రాజధాని గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. రాజధాని గ్రామాల్లో తిరిగి అభివృద్ధి పనులు ప్రారంభమవుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రాజధాని నిర్మాణానికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు పడుతుండడమే కాదు.. ఇప్పటి వరకూ ముందరి కాళ్ళకు బంధాలుగా మారిన సమస్యలూ ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. ఇక రాజధాని నిర్మాణం నల్లేరు మీద నడకే అన్నట్లుగా పనులు సాగుతున్నాయి. అడపాదడపా కురిసే వర్షాల మూలంగా ఇబ్బందులు మినహా రాజధాని నిర్మాణానికి ప్రధాన ఆటంకాలు ఏమీ లేవనే చెప్పాలి. ఈ నెల దాటితే ఆ వర్షాలకు కూడా టాటా చెప్పి రాజధాని నిర్మాణాన్ని పరుగులు పెట్టించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సీఆర్డీఏ ఉన్నాయి.

సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభంతో నూతనోత్సాహం

రాజధాని నిర్మాణంలో ఏపీ సీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్)లదే కీలకపాత్ర. ఇప్పటి వరకూ వాటి ప్రధాన కార్యాలయాలు రాజధానికి దూరంగా విజయవాడలో ఉండి కార్యకలాపాలు నిర్వహించాల్సి వచ్చేంది. ఈ నెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయపూడిలో నిర్మించిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకూ విజయవాడలో ఉన్న సీఆర్డీఏ, ఏడీసీఎల్ కార్యాలయాలు అమరావతికి తరలివచ్చాయి. ఫలితంగా ఇకపై రాజధాని నిర్మాణ పనులు, పురోగతిపై ఈ కార్యాలయాల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండబోతోంది. ఈ కారణంగా పనుల్లో వేగం మరింత పెరగనుంది.

భూ సమీకరణ అడ్డంకులు తొలగడంతో..

రాజధాని కోసం 33,800 ఎకరాల భూములు సమీకరించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం భావించగా, ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు గ్రామాల్లో కొంతమంది రైతులు నిరాకరించారు. ఆ కారణంగా సుమారు 3 వేల ఎకరాల భూమి సమీకరణలోకి రాకుండా ఆగిపోయింది. తాజాగా కొందరు రైతులు భూ సమీకరణకు ముందుకు రావడంతో దాదాపు 350 ఎకరాల భూమిని ప్రభుత్వం సమీకరించగలిగింది. మిగిలిన రైతుల్లో కూడా సానుకూల స్పందన కనిపిస్తుండడంతో ఆ సమస్యకు కూడా త్వరలో పరిష్కారం లభించే అవకాశం కనిపిస్తోంది. రైతులు భూమివ్వడానికి ముందుకు రావడంతో గతంలో ఆగిపోయిన పనులు వేగం పుంజుకున్నాయి. ఉండవల్లి, పెనుమాక రైతులు భూసమీకరణకు అంగికరించడంతో గతంలో వెంకటపాలెంలోని మంతెన సత్యనారాయణ ఆశ్రమం వరకూ వచ్చి ఆగిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం వేగం పుంజుకుంది. ఎన్‌హెచ్ 16పై ఉన్న కనకదుర్గమ్మ వారధి వరకూ విస్తరించేందుకు మార్గం సుగమమయింది. ఇప్పటికే చాలా వరకూ పనులు మొదలయ్యాయి కూడా.

తర్వాత ప్రారంభమయ్యేది ఐఏఎస్ అపార్ట్‌మెంట్లే

రాజధాని నిర్మాణంలో భాగంగా ఇప్పటికే సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభం కాగా, త్వరలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు ప్రారంభమవుతాయని తెలుస్తోంది. అదే జరిగితే తొలిగా ప్రారంభమయ్యే ప్రభుత్వాధికారుల నివాసాలు ఇవే అని చెప్పాలి. వీటికి సంబంధించి బయటివైపు పనులన్నీ పూర్తయ్యాయి. ఇంటీరియర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వాటితో పాటు ప్రజాప్రతినిధుల భవన సముదాయాలైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అపార్ట్‌మెంట్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు తుది మెరుగులు దిద్దుతుండగా, ఎమ్మెల్సీ క్వార్టర్స్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శుల, కార్యదర్శుల భవనాల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. ఇప్పటికే కొన్ని భవనాలు తుది మెరుగులు దిద్దుకుంటుండగా, మరికొన్ని భవనాల నిర్మాణం వేగం పుంజుకుంది. హైకోర్టు న్యాయమూర్తుల గృహ సముదాయం, మంత్రుల గృహసముదాయం పనుల్లో కూడా పురోగతి కనిపిస్తోంది.

అత్యంత వేగంగా మౌలిక సదుపాయాల కల్పన

రాజధానిలో ప్రతిష్ఠాత్మక సంస్థలు అడుగుపెడుతున్న నేపథ్యంలో సీఆర్డీఏ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టింది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తొలి ప్రాధాన్యంగా రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. రహదారుల నిర్మాణంలో భాగంగా వాటర్ లైన్, మురుగు, వరద నీటి డ్రైన్, అండర్ గ్రౌండ్ విద్యుత్, కమ్యూనికేషన్ లైన్ల కోసం ఏర్పాటు చేసే యుటిలిటీ డక్టుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులకు వర్షాలు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలోనే పనులు జరుగుతుండడం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి

రాజధాని కోసం భూములిచ్చిన రైతుల రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు. ఇటీవల సీఆర్డీఏ కార్యాలయ ప్రారంభ సమయంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశమై అదే విషయాన్ని నొక్కి చెప్పారు. 'మీ త్యాగం మర్చిపోను. త్యాగమూర్తులకు రెట్టింపు గౌరవ మర్యాదలు, ఆదాయం వచ్చేలా చేస్తానని' ముఖ్యమంత్రి వారికి మాటిచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఆర్డీఏ తాజాగా రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించింది. రాజధాని గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో అంతర్గత రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ పనులు కూడా పూర్తయి రైతులకు ప్లాట్లు దక్కితే, అక్కడ కూడా నిర్మాణాలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మొదలైతే రాజధాని నిర్మాణాన్ని ఆపడం ఎవరి తరం కాదని రైతులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండడం పట్ల రాజధాని ప్రాంత వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రైతుల ముఖాల్లో ఆనందం చిగురిస్తోంది.



బయటి పనులు పూర్తైన ఎమ్మెల్యే క్వార్టర్స్

తుది దశకు చేరిన ప్రధాన కార్యదర్శుల నివాసాలు



డీఏ విడుదలపై ఎన్‌జీవో సంఘం హర్షం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిల్లోని ఒక డీఏను ప్రభుత్వం విడుదల చేయడంపై ఏపీ ఎన్‌జీవో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఆరాధ్య శ్యాంసుందర్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన పీఆర్సీ అమలుకు కమిషనర్ నియామకానికి తగు చర్యలు తీసుకుంటానని, 2004 నోటిఫికేషన్ ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింప చేస్తామని ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడం ఆనందకరమని అన్నారు. అలాగే ఉద్యోగ సంఘ భవనాలకు ఆస్తి పన్నును రద్దు చేయడం, ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య స్నేహపూర్వక వాతావరణముందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బకాయి పడ్డ రూ. 35వేల కోట్లలో రూ.10వేల కోట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిందని చెప్పారు. రోడ్డు రవాణాశాఖల్లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో షేక్ నాగూర్ షరీఫ్, సూరేపల్లి రాజశేఖర్, కృష్ణ కిషోర్, కూరాకుల శ్రీనివాసరావు, సయ్యద్ జానీబాషా, విజయ్, సుకుమార్ సూరి, కల్యాణ్, శ్రీవాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏపీ ఎన్‌జీవో సంఘ నాయకులు

26న డాక్టర్ ముద్దన హనుమంతరావు గ్రంథావిష్కరణ సభ

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంత రావు జీవిత సంగ్రహంపై డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు రాసిన గ్రంథావిష్కరణ సభ ఈ నెల 26న, స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పద్మావతి కళ్యాణ వేదికపై జరుపుతున్నట్లు భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లెపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం దేవస్థానం ఆవరణలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. సభలో మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కరణం బలరామకృష్ణమూర్తి, కేఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో సాహితీ ప్రియులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మస్తానయ్య, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు, ఏలూరి సూర్యనారాయణ, ఇరుగులపాటి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో ఆదివారం చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం విశ్వశాంతిని కాంక్షిస్తూ ఈ హోమాన్ని చేశారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ప్రధానకార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ

గుంటూరు (విద్య) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో పేద వృద్ధులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ సాయి ప్రగతి ఇన్‌ఫ్రా డెవలపర్ డైరెక్టర్ గురుప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద వృద్ధులకు ఇటువంటి కార్యక్రమాల వల్ల ఆర్థిక భరోసా కలుగుతుందని వెల్లడించారు. ఆధ్వర్యంలో నెలనెలా వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో ఆవోపా ప్రతినిధులు కేవీ బ్రహ్మం, సీహెచ్ నాగేంద్ర కుమార్, వచ్చా రాధాకృష్ణయ్య, రాచపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాడీపేటలో ఘనంగా గ్యార్మీ వేడుకలు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గ్యార్మీ సందర్భంగా బ్రాడీపేట మొదటలైనులో జెండా చెట్టు వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) హాజరై ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ, అల్లా ఆశీస్సులతో సర్వ మానవాళి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గార్మీ ఉత్సవ కమిటీ సభ్యులు ఖాసిం పీరా, హుస్సేన్ బాష, నాగరాజు, సచివాలయ కన్వీనర్లు నారాయణ, షేక్ జానీ రసూల్ తదితరులున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి : ఆరుగురి అరెస్టు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదపలకలూరులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, నల్లపాడు పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.26 వేల నగదు, ఆరు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొద్ది రోజులుగా టాస్క్ ఫోర్స్ పోలీసులు జిల్లావ్యాప్తంగా పేకాట, గంజాయి, వ్యభిచారం, కోడిపందేలు, రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌పై విస్తృత దాడులు సాగిస్తున్నారు. దీంతో అసాంఘిక శక్తుల్లో అలజడి మొదలైంది.

దీపావళి ప్రతి ఇంటా వెలుగులు నింపాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



తమీమ్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ ప్రతి ఇంటిలో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆకాక్షించారు. కాలుష్యం లేని, ఆనందమైన దీపావళిని ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 20వ తేదీన దీపావళి పండగ సందర్భంగా ప్రజలు హరిత టపాసులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రమాదాలకు గురి కాకుండా దీపావళి జరుపుకోవాలన్నారు. దీపావళి పండుగ ప్రతి ఇంటిలో సుఖ సంతోషాలు, ఆనందం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆనందమయ దీపావళికి టపాసుల విక్రయదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. అలానే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

సాహిత్యంలో హాస్యం ఆరోగ్యప్రదం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంలో హాస్యం ఆరోగ్యప్రదం అని ప్రముఖ సాహితీవేత్త వసుధ అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సభలో ఆయన ప్రసంగించారు. సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించారు. ప్రాచీన సాహిత్యంలోని చాటువులు, ప్రముఖుల పద్యాలు, జరుక్ శాస్త్రీ ప్యారడీలు, ఆరుద్ర అంత్య ప్రాసల కవితలు, అనేక చమత్కార మినీ కవితలు వినిపించి సభను రంజింప చేశారు. సభలో 'ఈ మాసం కవి'గా మాన్‌సింగ్ పాల్గొని జనరంజకమైన గేయాలను పాడి వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠన కార్యక్రమంలో సంబరాజు రమణి, చల్లా సత్యవతి, గడల శివప్రసాద్, ఏ.శంకర్, బండికల్లు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర కృష్ణ, డాక్టర్ మైలవరపు లలితకుమారి, పుట్టంరాజు నరసింహమూర్తి, పూసపాటి కృష్ణ సూర్యకుమార్, మన్నం వెంకటగురువు, డాక్టర్ ఆర్ కుమారస్వామి, సోపాటి ప్రభాకర్, లంక మాధవి, కృష్ణ భార్గవి తదితరులు పాల్గొన్నారు. తొలుత 'సినీ మధుర గేయం' శీర్షికలో డాక్టర్ రావి రంగారావు 'చిన్నారి పొన్నారి పువ్వు' అనే దాశరథి రాసిన సినీ గేయాన్ని వినిపించి కవిత్వ విశ్లేషణ చేశారు. 'నాకు నచ్చిన కవిత' శీర్షికలో ఆశారాజు రాసిన 'కృతజ్ఞతలు' కవితను యర్రగుంట్ల పాణిరావు విశ్లేషించారు. సభలో డాక్టర్ సూర్యదేవర రవికుమార్‌కు సాహితీ మిత్రులు పక్షాన డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ టి.సేవకుమార్ జ్ఞాపికను, నగదు బహుమతిని అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి వసుధను, ఈ మాసం కవిగా పాల్గొన్న మాన్‌సింగ్‌ను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. 'నిక్కచ్చి కవిత' పోటీ విజేత ఏ.శంకర్ ను కూడా సంస్థ పక్షాన సత్కరించారు.

రైలులో మహిళపై అత్యాచారం, దోపిడీ కేసులో నిందితుడు అరెస్టు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు సమీపంలో రైలులో మహిళపై అత్యాచారం... దోపిడీ చేసిన కేసులో నిందితుడుని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన జొన్నలగడ్డ రాజారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 13న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన బాధితురాలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ బయలుదేరింది. రైలు నెం.07222లో చర్లపల్లికి వెళ్లడానికి బయలుదేరింది. తదుపరి సుమారు 7 గంటల 5 నిమిషాలకు రైలు గుంటూరు రైల్వే స్టేషన్‌కు రాగా తోటి ప్రయాణీకులందరూ లేడీస్ కోచ్ నుంచి దిగి పోయారు. అప్పుడు బాధితురాలు ఒక్కటే లేడీస్ కోచ్‌లో ఒంటరిగా ఉంది. అది గమనించిన నిందితుడు రైలు బండి కదులుతుండగా లేడీస్ కోచ్ ఎక్కి మూసి వున్న తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. అప్పుడు బాధితురాలు ఇది లేడీస్ కోచ్ అని అతనితో అనగా అందుకు నిందితుడు తరువాత స్టేషన్ లో దిగి పోతాను అని ఆమెను తలుపు తెరవమని ఒప్పించి కోచ్‌లోకి ప్రవేశించి లోపలి నుంచి తలుపు మూసివేశాడు. రైలు నల్లపాడు రైల్వే స్టేషన్ దాటిన తరువాత నిందితుడు బాధితురాలికి కత్తిని చూపించి బెదిరించి, ఆమెను కొట్టాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత రైలు నెమ్మదిగా పెదకూరపాడు రైల్వే స్టేషన్‌ను సమీపిస్తుండగా, ఆమె వద్ద నుంచి పరుసు, సెల్ ఫోన్‌ని లాక్కుని నిందితుడు కదులుతున్న రైలు నుంచి దూకి పారిపోయాడు. ఆ తర్వాత బాధితురాలు అదే రైలులో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసింది. అంతట వారు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. ఘటన జరిగిన ప్రాంతం నడికుడి జీఆర్‌పీ పరిధిలోనిది కావడంతో కేసును నడికుడి జీఆర్‌పీకి బదిలీ చేశారు. దీంతో నడికుడి జీఆర్‌పీలో తిరిగి కేసు నమోదు చేసుకొని రైల్వే స్టేషన్ లోని సీసీ కెమెరాలు, బాధితురాలు చెప్పిన వివరాలు ఆధారంగా, అలాగే సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. నిందితుడు మూడు నెలలుగా గుంటూరు కేంద్రంగా రైల్వే స్టేషన్, రైళ్ళలో తిరుగుతూ కామోన్మాదంతో నేరాలు చేసేందుకు యత్నిస్తున్నాడు. నిందితుడు రాజారావు వేధింపులు తట్టుకోలేక ముఖ్యంగా భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్ళడంతో మరింత ఉన్మాదంతో అవకాశం కోసం ఎదురుచూస్తూ ఈ దారుణానికి పాల్పడ్డాడు. అయితే నిందితుడు ఇదే తరహాలో ఒకరిద్దరిపై కూడా ఇలాగే అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ బాధితుల నుంచి ఫిర్యాదు రాకపోవడంతో ఆయా ఘటనలపై పోలీసులకు స్పష్టత రాలేదు. నిందితుడు బాధితురాలి సెల్ ఫోన్‌లోని సిమ్ కార్డును తనసెల్‌ఫోన్‌లో వేసుకోవడంతో పోలీసులు నిందితుడిని వెంటనే పట్టుకోగలిగారు. కాగా ఈ కేసును చేదించిన రైల్వే సీఐలు కరుణాకర రావు, అంజిబాబు, ఎస్సైలు రాజమోహన్, పి రమేష్, వెంకటాద్రి, వీరబాబు, శ్రీనివాసరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు బి శంకరరావు, బి అశ్వినికుమార్, విశంకర్‌ను రైల్వే ఉన్నతాధికారులు అభినందించారు.

దీపావళి వెలుగులు నింపాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు జిల్లాలోని పాల రైతులకు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఆదివారం దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాస రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందే దిలీప్, వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తదితర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వశాఖల అధికారులు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు





అత్తోటలో కోతకు గురైన సిమెంట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన అధికారులు

కోతకు గురైన సిమెంట్ రోడ్డుకు మరమ్మతులు

కొల్లిపర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్తోటలో కోతకు గురైన సిమెంట్‌రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు నిర్వహించారు. రోడ్డు కోతకు గురై ప్రజలు అనేక ఇబ్బందులకు పడుతున్నారని, రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు కూడా పట్టించుకోవడంలేదని అనేక పర్యాయాలు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దాంతో పంచాయతీరాజ్ అధికారులు ఎట్టకేలకు స్పందించి మరమ్మతులు నిర్వహించారు. సిమెంట్‌రోడ్డు కోతకు గురైన చోట ఇరుపక్కలా సైడ్‌వాల్ నిర్మించారు. త్వరలో కోతకుగురైన చోట సిమెంట్‌తో రోడ్డును కూడా వేయించనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి తెలియజేశారు.

కృష్ణానదిలో కొనసాగుతున్న వరద ఉధృతి

● నదిలోకి ఎవరూ వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక

కొల్లిపర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి 49 వేల క్యూసెక్కులకు పైగా నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయడంతో రెండు రోజులుగా వరద ఉధృతి కొనసాగుతోంది. రేవుల్లోకి ఎవరూ వెళ్ళ వద్దని తహసీల్దార్ సిద్ధార్థ హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాల్లోని రేవులను రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. జాలర్లు జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.



కొల్లిపరలో లంక గ్రామాల నుంచి పడవలో వస్తున్న రైతులు

ఆదర్శవంతమైన సమాజ రూపకల్పనకు కృషి చేయాలి

- ఎమ్మెల్సీ ఆలపాటి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వారంతా ఆదర్శవంతమైన సమాజ రూపకల్పనలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. సుల్తానాబాద్‌లో ఆదివారం నియోజకవర్గంలో డీఎస్సీ పరీక్షల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నియామకాలు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించడం చారిత్రాత్మకమని అన్నారు. ఉపాధ్యాయులు తమ శక్తిని, విజ్ఞానాన్ని, మంచి సమాజాన్ని పెంపొందించేందుకు వినియోగించాలన్నారు. భావితరాలను ప్రభావితం చేసే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని, బాల బాలికలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

వెరికోస్ వెయిన్స్ బాధితులకు వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి వైద్యులు వెరికోస్ వెయిన్స్ బాధితులకు పరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, బుర్రా జయలక్ష్మి, సుబ్బారావు, భవానీ, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య ఇంటర్ విద్యార్థులకు ఫేర్‌వెల్



బహుమతులు అందజేస్తున్న ఏజీఎం దుర్గాప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): స్థానిక శివాజీ చౌక్‌లోని శ్రీ చైతన్య వ్యాసభవన్‌లో ఆదివారం ఇంటర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు. సెలబ్రేటింగ్ టూగెదర్‌నెస్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఏజీఎం దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల జీవితంలో కీలకమైన మలుపు ఇంటర్ విద్యతోనే వస్తుందని, ఈ దశలో కష్టపడి చదివిన వారికే మంచి జీవితం లభిస్తుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని, తల్లిదండ్రులు విద్యార్థుల అభిరుచిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీన్ చంద్రశేఖర్, తిరుపతిరావు, రామకృష్ణారెడ్డి ప్రసంగించారు.

సామాజిక సంక్షేమానికి కల్పవృక్ష కృషి



స్వీట్లు పంపిణీ చేస్తున్న కల్పవృక్ష ప్రతినిధులు

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంక్షేమానికి కల్పవృక్ష కృషి చేస్తుందని జైన్ సేవా సంస్థ అధ్యక్షుడు రమేష్‌జైన్ చెప్పారు. గాంధీ చౌక్‌లో సంస్థ పదేళ్ల సేవలను పురస్కరించుకుని ఆదివారం స్వీట్లు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు అమన్ జైన్ మాట్లాడుతూ, లాభాపేక్ష లేకుండా విద్య, ఆరోగ్యం, ధార్మిక కార్యక్రమాల అభివృద్ధికి సంస్థ సహకారం అందిస్తుందన్నారు. కోవిడ్ సమయంలో పలు సేవలు అందించామని, విద్యార్థులకు, పాఠశాలలకు అవసరమైన సాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మిశెట్టి హరికృష్ణ, షేక్ కాలేషా, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి: ఏఐటీయూసీ

పొన్నూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తాడిశెట్టి శ్రీను మృతదేహానికి ఏఐటీయూసీ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ తరపున తాడిశెట్టి శ్రీను కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. నివాళులర్పించిన వారిలో యూనియన్ నాయకులు పగడాల వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాస్, సయ్యద్ ఖాసిం, కట్టెంపూడి శ్రీను, తదితరులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు







రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సాంబశివరావు

రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక

తెనాలి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెనాలి త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ సాంబశివరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. స్టేషన్ పరిధిలో 68 మంది రౌడీషీటర్లు నమోదు అయి వున్నారు. వారి కదలికలపై ప్రతినిత్యం నిఘా కొనసాగుతుంది. వారు తిరిగి ఎలాంటి నేరాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు. హత్య, హత్యాయత్నం, దొమ్మీ, ఇతర కేసులతో పాటు ఐదు అంతకంటే ఎక్కువ కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని సక్రమంగా ఉండే వారికి రౌడీషీట్ నుండి తొలగిస్తామని, సరైన మార్గానికి రావాలని సీఐ రౌడీషీటర్లకు సూచించారు.



ఎంపికైన నూతన కార్యవర్గం

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చైతన్య

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కాళిదాసు చైతన్య, కార్యదర్శిగా గ్లోరియస్ నాగరాజు ఎన్నికయ్యారు. సుల్తానాబాద్‌లో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షునిగా ఆనంద్, సంయుక్త కార్యదర్శిగా షేక్ రఫీ, కోశాధికారిగా భరత్‌కుమార్, పీఆర్‌వోగా నాగగోవర్ధనరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో త్రీటౌన్ సీఐ సాంబశివరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ల్యాబ్ నిర్వాహకులు ప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షుడు ఫ్రాంక్లిన్‌బాబు, విజయసారధి, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అసోసియేషన్ లోగో, పోస్టర్ ఆవిష్కరించారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

కొల్లిపర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఆదివారం జూదరులపై దాడులు నిర్వహించగా అత్తోటలో 5గురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం అత్తోటలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న రూ 7వేల 600లను, మూడు సెల్ ఫోన్‌లను సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

రైలులో మహిళపై..
అత్యాచారం, దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు సమీపంలో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన మహిళపై అత్యాచారం... దోపిడీ చేసిన కేసులో నిందితుడుని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన జొన్నలగడ్డ రాజారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 13న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన బాధితురాలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ బయలుదేరింది. రైలు నల్లపాడు రైల్వేస్టేషన్ దాటిన లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉన్న బాధితురాలికి నిందితుడు కత్తిని చూపించి బెదిరించి, ఆమెను కొట్టాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత రైలు నెమ్మదిగా పెదకూరపాడు రైల్వే స్టేషన్‌ను సమీపిస్తుండగా, ఆమె వద్ద నుంచి పరుసు, సెల్ ఫోన్‌ని లాక్కుని నిందితుడు కదులుతున్న రైలు నుంచి దూకి పారిపోయాడు. ఆ తర్వాత బాధితురాలు అదే రైలులో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసింది. నిందితుడు మూడు నెలలుగా గుంటూరు కేంద్రంగా రైల్వే స్టేషన్, రైళ్లలో తిరుగుతూ కామోన్మాదంతో నేరాలు చేసేందుకు యత్నిస్తున్నాడు. రాజారావు వేధింపులు తట్టుకోలేక ముఖ్యంగా భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లింది. నిందితుడు ఇదే తరహాలో ఒకరిద్దరిపై కూడా ఇలాగే అత్యాచా రానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ బాధితుల నుంచి ఫిర్యాదు రాకపో వడంతో ఆయా ఘటనలపై పోలీసులకు స్పష్టత రాలేదు. నిందితుడు బాధితురాలి సెల్ ఫోన్‌లోని సిమ్ కార్డును తన సెల్‌ఫోన్‌లో వేసుకోవడంతో పోలీసులు నిందితుడిని వెంటనే పట్టుకోగలిగారు. రైల్వే సీఐలు కరుణాకరరావు, అంజిబాబు, ఎస్సైలు రాజమోహన్, పి.రమేష్, వెంకటాద్రి, వీరబాబు, శ్రీనివాసరెడ్డిలను రైల్వే అధికారులు అభినందించారు.

కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు..
త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి. లక్ష్మీ నరసయ్య అన్నారు. గుంటూరు సీపీఎం కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణల ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారాలు అందజేయడం సముచితమని అన్నారు. సభలో మరో ముఖ్యఅతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించింది రామస్వామి అని గుర్తుచేసుకున్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలను ప్రదానం చేసి వారిని ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరీ సుధ తదితరులు ప్రసంగించారు.



ఆలా వెంకటేశ్వర్లుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు

బాణసంచా విక్రయాలపై వర్షం ప్రభావం

● వీఎస్ఆర్ కళాశాలలో 40 దుకాణాలు ఏర్పాటు

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ బాణసంచా విక్రయాలపై వర్షం ప్రభావం చూపింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా జల్లులు కురిశాయి. పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో బాణసంచా విక్రయించేందుకు 40 దుకాణాలకు అధికారులు తాత్కాలిక లైసెన్స్‌లు జారీ చేశారు. అక్కడ దుకాణాలను ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు బాణసంచా కొనే వారి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు వర్షం కారణంగా దుకాణాలకు వెళ్లే ప్రాంగణమంతా చిత్తడిగా మారింది. కొనే వారి కోసం తడిసిన బురద నేలపై అట్టలు పరిచి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి వర్షం తెరిపి ఇవ్వడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. గత రెండేళ్లుగా బాణసంచా విక్రయాలను పట్టణంలోని కీలక ప్రాంతంలో ఉన్న తాలూకా జూనియర్ కళాశాల నుంచి మార్చి వీఎస్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బాణసంచా ధరలు పది శాతం వరకు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దీపావళి బాణసంచాలో పేరున్న స్టాండర్డ్ కంపెనీకి చెందిన టపాసులను ఎంఆర్‌పీపై 80 శాతానికిపైగా డిస్కౌంట్‌తో విక్రయిస్తున్నారు. ఇతర కంపెనీల బాణసంచా కూడా ఇంచుమించు అదే స్థాయిలో భారీగా డిస్కౌంట్ ఇస్తున్నప్పటికీ ఎంఆర్‌పీ ధరలు వేల రూపాయల్లో ముద్రించారని కొనుగోలుదారులు వాపోయారు. దుకాణం ఏర్పాటుకు ఒక్కో వ్యాపారికి రూ.50 వేలు వరకు ఖర్చయిందని, పట్టణంలో ఇక ఎక్కడా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ తోపుడు బండ్లపై బాణసంచా విక్రయాలు జోరుగానే సాగుతున్నాయి. ఒక్కో తోపుడు బండి నుంచి రూ.వెయ్యి వరకు పోలీసులు మామూళ్లు అందుకున్నట్లు సమాచారం.



తెనాలి: వర్షం కారణంగా చిత్తడిగా మారిన ప్రాంగణం

బాణసంచా విక్రయాలకు వాన గండం



బురదగా మారిన దీపావళి బాణసంచా విక్రయ స్టాల్స్

పొన్నూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి బాణాసంచా విక్రయ స్టాల్స్‌కు వానగండం పొంచి ఉంది. పట్టణంలోని సాక్షి, భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో దీపావళి బాణాసంచా విక్రయ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం పడుతూనే ఉంది. వర్షంతో బాణాసంచా విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. స్టాల్స్ ప్రాంగణం బురద మయంగా మారింది. వాన నీరు నిల్వ ఉండటంతో కొనుగోలుదారులు ఆ వైపు వెళ్లడానికి వెనకడుగు వేశారు. దీపావళి పండుగ ఒక్క రోజు మాత్రమే ఉండటంతో బాణాసంచా విక్రయాల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి బాణాసంచా కొనుగోలు చేసి తెచ్చిన స్టాల్స్ నిర్వాహకులు వర్షం ఏకధాటిగా కురుస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పండుగ రోజు అయినా వర్షం కురవకపోతే విక్రయాలు జరుగుతాయని లేదంటే నష్టాలు చవి చూడాల్సివస్తుందని స్టాల్స్ నిర్వాహకులు వాపోతున్నారు.

పెదకాకాని శంకుస్థాపనలో
ప్రొటోకాల్ ఉల్లంఘన

● ఆగ్రహం వ్యక్తం చేసిన దళిత సంఘాలు

పెదకాకాని, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పెదకాకాని గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించినట్లు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం పలువురు నాయకులు మాట్లాడుతూ దళిత సర్పంచ్‌కి అవమానం జరిగిందన్నారు. పెదకాకాని సెంటర్ నుండి వెనిగండ్ల వరకు ఆర్అండ్‌బీ రోడ్డు మూడు కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు శంకుస్థాపన శిలాఫలకంపై అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపించారు. పెదకాకాని సెంటర్లో రోడ్డు శంకుస్థాపన విషయంలో శిలాఫలకం వేసి అందులో ప్రోటోకాల్ పాటించకుండా దళిత సర్పంచ్ అయిన గోళ్ళ స్వరూప రాణి పేరును వేయకపోవడం రాజకీయ కక్ష సాధింపేనని అన్నారు. ఇప్పటికైనా అధికారులు సర్పంచ్ పేరు పెట్టాలని దళిత సంఘాల నాయకులు కంతేటి ఎలమంద తదితరులు కోరారు.



సర్పంచ్ పేరు లేకుండా ఆవిష్కరించిన శిలాఫలకం

పొదుపు మొత్తాన్ని స్వాహా చేసిన పోస్టల్ ఉద్యోగి

● వృద్ధురాలి ఫిర్యాదు

దుగ్గిరాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు పోస్టాఫీసులో పొదుపు చేసుకున్న మొత్తాన్ని ఓ పోస్టల్ ఉద్యోగి స్వాహా చేశాడంటూ దుగ్గిరాల పోలీసులకు ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేసింది. మండల గ్రామం చిలువూరుకు చెందిన బాధితురాలు చిలువూరు అవ్వమ్మ 2018 నుంచి 2023 వరకు గ్రామంలోని సబ్‌పోస్టాఫీసులో నెలకు రూ.2వేల చొప్పున పొదుపు చేసుకుంది. పోస్టాఫీసులో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి నెలనెలా చెల్లిస్తూ వచ్చానని, పుస్తకం కూడా తనవద్దనే దాచుకున్నాడని తెలిపింది. నిర్ణీత కాలం పూర్తయ్యాక పోస్టాఫీసుకు వెళ్లి అధికారులను కలిసి తన పొదుపు మొత్తం ఇవ్వాలని కోరానని, తమవద్ద పాస్‌పుస్తకం లేదని వారు చెప్పారని తెలిపింది. అదేంటని అడిగితే రూ.1.50లక్షలు చెల్లిస్తామని, లేదంటే డూప్లికేట్ పాస్‌పుస్తకం ఇస్తామని చెప్పారని వెల్లడించింది. డూప్లికేట్ పుస్తకం కోసం దరఖాస్తు చేయగా తన పేరిట అసలు ఖాతానే లేదని అధికారులు చెప్పారని తెలిపింది. తనను మోసం చేసిన పోస్టల్ ఉద్యోగిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులను ఆశ్రయించింది.

డీఏ విడుదలపై ఎన్‌జీజీవో సంఘం హర్షం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిల్లోని ఒక డీఏను ప్రభుత్వం విడుదల చేయడంపై ఏపీ ఎన్‌జీజీవో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఆరాధ్య శ్యాంసుందర్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన పీఆర్సీ అమలుకు కమిషనర్ నియామకానికి తగు చర్యలు తీసుకుంటానని, 2004 నోటిఫికేషన్ ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింప చేస్తామని ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడం ఆనందకరమని అన్నారు. అలాగే ఉద్యోగ సంఘ భవనాలకు ఆస్తి పన్నును రద్దు చేయడం, ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య స్నేహపూర్వక వాతావరణముందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బకాయి పడ్డ రూ. 35వేల కోట్లలో రూ.10వేల కోట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిందని చెప్పారు. రోడ్డు రవాణాశాఖల్లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో షేక్ నాగూర్ షరీఫ్, సూరేపల్లి రాజశేఖర్, కృష్ణకిషోర్, కూరాకుల శ్రీనివాసరావు, సయ్యద్ జానీబాషా, విజయ్, సుకుమార్ సూరి, కల్యాణ్, శ్రీవాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏపీ ఎన్‌జీజీవో సంఘ నాయకులు

26న డాక్టర్ ముద్దన హనుమంతరావు గ్రంథావిష్కరణ సభ



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న బొల్లేపల్లి, మస్తానయ్య తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతరావు జీవిత సంగ్రహంపై డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు రాసిన గ్రంథావిష్కరణ సభ ఈ నెల 26న, స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పద్మావతి కళ్యాణ వేదికపై జరుపుతున్నట్లు భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లెపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానం ఆవరణలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. సభలో మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కరణం బలరామకృష్ణ మూర్తి, కేఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో సాహితీ ప్రియులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్టిపోతు మస్తానయ్య, డాక్టర్ వెన్ని శెట్టి సింగారావు, ఏలూరి సూర్యనారాయణ, ఇరుగులపాటి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి పర్వదినం సందర్భంగా సోమవారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు గానీ, డీఎస్పీని గానీ సంప్రదించాలని సూచించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు సహకరించాలని కోరారు.

పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు ఆదివారం 4,513 క్యూసెక్కుల నీరు విడుదల చేసినటు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 43,500 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 216 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1,526 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 563 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 118 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 281 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపకులపతి కృపాచారికి సన్మానం

తెనాలి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దళిత సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిని ఆదివారం టౌన్‌చర్చిలో ఘనంగా సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనను సత్కరించారు. సంఘ కాపరులు, అడహక్ కమిటీ సభ్యులు, స్త్రీల సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి వర్షపునీరు


ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

తాడేపల్లిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి తాడేపల్లి పట్టణంలోని బోటుయార్డు వద్ద గల ఇళ్లలోకి మోకాళ్లలోతు వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో తాము రాత్రంతా మునికాళ్లపై నిలబడాల్సి వచ్చిందని స్థానికులు వాపోయారు. ఎప్పుడు వర్షం వచ్చినా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పాలకులు స్పందించి తమ వెతలు తీర్చాలని వారు కోరారు.

నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

తాడికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిని చీల్చుకుంటూ వచ్చే వెలుగులకు ప్రతీకగా జరుపుకునే దీపావళి అందరి జీవితాల్లోని కష్టాలను తొలగించాలని ఆకాంక్షించారు. పిల్లల టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభం


గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మెల్లెంపూడి-నూతక్కి మధ్య గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆదివారం పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.18లక్షల నిధులతో మెల్లెంపూడి గ్రామ జడ్పీ రోడ్డు నుంచి నూతక్కి మాతృఛాయ అనాథాశ్రమం వరకు ఈ గ్రావెల్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే మెల్లెంపూడి-నూతక్కి పరిసర ప్రాంతాల రైతులకు వ్యవసాయ ఉత్పత్తులకు రవాణా సౌకర్యం లభించనుంది. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఈ ప్రాంత రైతులు చాలా కాలంగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం ప్రారంభమైందని చెప్పారు. పంట సీజన్ సమయంలో రవాణా ఇబ్బందులు లేకుండా రైతులు సులభంగా మార్కెట్ యార్డుకు తమ పంటలను తరలించగలుగుతారని కిరణ్‌చంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెల్లెంపూడికి చెందిన టీడీపీ సీనియర్ నేత బొమ్మారెడ్డి కోటిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ ఖాసింబాబు, సొంఠి రామ్మోహనరావు, దొంతిరెడ్డి నాగిరెడ్డి, సంజీవరెడ్డి, కంచర్ల లెనిన్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, కొండలరావు, సాంబిరెడ్డి, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడిరైతులను ప్రోత్సహించడమే సంగం డెయిరీ ధ్యేయం

● డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు


పాడిరైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు

పెదనందిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ప్రోత్సహించడమే సంగం డెయిరీ ప్రధాన ధ్యేయమని డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని నాగులపాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ కార్యాలయంలో ఆదివారం పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి రైతులను ఆదుకునేందుకు సంగం డెయిరీ అనేక ప్రోత్సాహకాలతో పాటు సబ్సిడీలు, ఉచిత వైద్యశిబిరాలు, బీమా సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఎక్కడా లేని విధంగా సంగం డెయిరీ వినూత్నంగా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారి వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు అందిస్తోందని చెప్పారు. గతేడాది రూ.లక్ష నుంచి రూ. 3 లక్షల లోపు పాలు పోసిన 32మంది రైతులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గొల్లపూడి వాసు, టెస్టర్ కాలేషా, పాలకవర్గ సభ్యులు కాపు శేషారావు, నంగినేని నాగేశ్వరరావు, కమ్మ సురేశ్, చెరుకూరి గోపాలకృష్ణ, నిమ్మగడ్డ శంకర్, వీరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడమే పాలకుల పని

● సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు


ప్రసంగిస్తున్న వేముల దుర్గారావు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గ శ్రమను పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడానికే పాలకులు పనిచేస్తున్నారని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు విమర్శించారు. ప్రకాష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటియూ పట్టణ కమిటీ, ఆహ్వానితుల విస్తృత సమావేశం తమ్మిశెట్టి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ, కార్మికవర్గ హక్కులను కాపాడుకోవడం కోసమే త్వరలో సీఐటీయూ ఆలిండియా మహాసభలు విశాఖపట్నంలో జరగబోతున్నాయని తెలిపారు. మహాసభల జయప్రదం కోసం ప్రతి సీఐటీయూ కార్యకర్త కృషి చేయాలన్నారు. కృష్ణనగర్ జోన్ సీఐటీయూ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా తమ్మిశెట్టి వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పట్టణ సీపీఎం కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారిన నాగేశ్వరరావు, బాబూరావు, సంతోషం రేణుక, సూరిబాబు నాగేశ్వరరావు, అంకయ్య, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల వైసీపీ కన్వీనర్‌గా ఖాసీంపీరా


షేక్ ఖాసీంపీరా

పెదనందిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ కన్వీనర్‌గా షేక్ ఖాసీంపీరా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి చేతుల మీదుగా ఖాసీం పీరా నియామకాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషిచేస్తూ, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రార్థనతో విధి రాతలో మార్పు


ప్రసంగిస్తున్న అబ్దుల్ రెహ్మాన్

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రార్థన(దువా)తో విధి రాతను మార్చుకోవచ్చని జామియత్ అహ్లె హదీస్ గుంటూరు జిల్లా అమీర్ అయిన జనాబ్ అబ్దుల్ రెహ్మాన్ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ఎ-తౌహీద్ మసీదులో శనివారం ధార్మిక సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అల్లాహ్‌తో మానవుని సంబంధం ఎలా ఉండాలి అనే అంశంపై ప్రసంగించారు. మానవులకు అల్లాహ్‌కు మధ్య సం బంధం ప్రార్థన అని అన్నారు. ఈ సమావేశంలో జామియత్ అహ్లె హదీస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు

పెదనందిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మృతిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఈ నెల 13న కాకుమాను మండలం చినలింగాయపాలెం గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై బోయపాలెం వైపు వెళ్తూ గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయాలపాలయ్యాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. అతడి మృతిపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుపవన్ తెలిపారు.

'కందుకూరు హత్య' బాధితులకు
హోం మంత్రి అనిత పరామర్శ

● గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్, భార్గవ్
● రూ.5 లక్షలు సాయం అందజేత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, కన్నా

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలోని దారకానిపాడులో జరిగిన దారుణ ఘటనలో తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్యకు గురికాగా, ఆయన ఇరువురు సోదరులు తిరుమలశెట్టి పవన్, భార్గవ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి హోం మంత్రి అనిత.. ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, కన్నా లక్ష్మీనారాయణలతో కలిసి ఆసుపత్రిలో వారిని పరామర్శించారు. వారి తండ్రి శ్రీనివాసరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. పవన్, భార్గవ్‌లకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితి గురించి సంబంధిత వైద్యులను అడిగారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.రెండున్నర లక్షల చొప్పున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

హేతువాద సాహిత్య పితామహుడు త్రిపురనేని

కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు..
త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం


ఆలా వెంకటేశ్వర్లుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు


గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి. లక్ష్మీ నరసయ్య అన్నారు. గుంటూరు సీపీఎం కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావు అధ్యక్షతన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణల ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారాలు అందజేయడం సముచితమని అన్నారు. సభలో మరో ముఖ్యఅతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించింది రామస్వామి అని గుర్తుచేసుకున్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలను ప్రదానం చేసి వారిని ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరీ సుధ తదితరులు ప్రసంగించారు.

రైలులో మహిళపై..
అత్యాచారం, దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు సమీపంలో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన మహిళపై అత్యాచారం... దోపిడీ చేసిన కేసులో నిందితుడుని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన జొన్నలగడ్డ రాజారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 13న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన బాధితురాలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ బయలుదేరింది. రైలు నల్లపాడు రైల్వే స్టేషన్ దాటిన లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉన్న బాధితురాలికి నిందితుడు కత్తిని చూపించి బెదిరించి, ఆమెను కొట్టాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత రైలు నెమ్మదిగా పెదకూరపాడు రైల్వే స్టేషన్‌ను సమీపిస్తుండగా, ఆమె వద్ద నుంచి పరుసు, సెల్ ఫోన్‌ని లాక్కుని నిందితుడు కదులుతున్న రైలు నుంచి దూకి పారిపోయాడు. ఆ తర్వాత బాధితురాలు అదే రైలులో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసింది. నిందితుడు మూడు నెలలుగా గుంటూరు కేంద్రంగా రైల్వే స్టేషన్, రైళ్లలో తిరుగుతూ కామోన్మాదంతో నేరాలు చేసేందుకు యత్నిస్తున్నాడు. రాజారావు వేధింపులు తట్టుకోలేక ముఖ్యంగా భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లింది. నిందితుడు ఇదే తరహాలో ఒకరిద్దరిపై కూడా ఇలాగే అత్యాచా రానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ బాధితుల నుంచి ఫిర్యాదు రాకపో వడంతో ఆయా ఘటనలపై పోలీసులకు స్పష్టత రాలేదు. నిందితుడు బాధితురాలి సెల్ ఫోన్‌లోని సిమ్ కార్డును తనసెల్‌ఫోన్‌లో వేసుకోవడంతో పోలీసులు నిందితుడిని వెంటనే పట్టుకోగలిగారు. రైల్వే సీఐలు కరుణాకరరావు, అంజిబాబు, ఎస్సైలు రాజమోహన్, పిరమేష్, వెంకటాద్రి, వీరబాబు, శ్రీనివాసరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు బి శంకరరావు, బి.అశ్వినికుమార్, వి.శంకర్‌ను రైల్వే ఉన్నతాధికారులు అభినందించారు.

కవి మాధవరావుకు కళామిత్ర సాహితీ అవార్డు

తుళ్లూరు, (అనంతవరం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం అనంతవరం గ్రామానికి చెందిన ప్రముఖ కవి బండ్ల మాధవరావుకు ఒంగోలు కళామిత్ర మండలి వారి కొంపల్లి బాలకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం అందజేస్తున్నట్లు కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డా. నూనె అంకమ్మరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేసారు. ఒంగోలు ఎన్ టి ఆర్ కళాక్షేత్రంలో నవంబర్ 2వ తేదీన జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం అందుకున్న మాధవరావు తానా సాహితీ పురస్కారం, ఆలూరి బైరాగీ స్మారక పురస్కారం వంటి ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. ఇప్పటివరకు ఏడు కవితా సంపుటులు వెలువరించడంతో పాటు కవిత్వం కోసం నడుపుతున్న కవితా మాసపత్రికకు సంపాదకులు గా ఉన్నారు. కళామిత్ర అవార్డు అందుకోబోతున్న మాధవరావును పలువురు సాహితీవేత్తలు అభినందించారు.



చిగురిస్తున్న ఆశలు..

● తిరిగి జీవం పోసుకుంటున్న నిర్మాణాలు
● తరలివచ్చిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం
● త్యాగమూర్తుల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు
● రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై దృష్టిసారించిన సీఆర్డీఏ

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పటి వరకూ ఒకలెక్క.. ఇక నుంచి ఒక లెక్క అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. రాజధాని నిర్మాణంలో కీలక భూమిక పోషించే ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలిరావడంతో రాజధాని గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. రాజధాని గ్రామాల్లో తిరిగి అభివృద్ధి పనులు ప్రారంభమవుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రాజధాని నిర్మాణానికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు పడుతుండడమే కాదు.. ఇప్పటి వరకూ ముందరి కాళ్ళకు బంధాలుగా మారిన సమస్యలూ ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. ఇక రాజధాని నిర్మాణం నల్లేరు మీద నడకే అన్నట్లుగా పనులు సాగుతున్నాయి. అడపాదడపా కురిసే వర్షాల మూలంగా ఇబ్బందులు మినహా రాజధాని నిర్మాణానికి ప్రధాన ఆటంకాలు ఏమీ లేవనే చెప్పాలి. ఈ నెల దాటితే ఆ వర్షాలకు కూడా టాటా చెప్పి రాజధాని నిర్మాణాన్ని పరుగులు పెట్టించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సీఆర్డీఏ ఉన్నాయి.

సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభంతో నూతనోత్సాహం

రాజధాని నిర్మాణంలో ఏపీ సీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్)లదే కీలకపాత్ర. ఇప్పటి వరకూ వాటి ప్రధాన కార్యాలయాలు రాజధానికి దూరంగా విజయవాడలో ఉండి కార్యకలాపాలు నిర్వహించాల్సి వచ్చేంది. ఈ నెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయపూడిలో నిర్మించిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకూ విజయవాడలో ఉన్న సీఆర్డీఏ, ఏడీసీఎల్ కార్యాలయాలు అమరావతికి తరలివచ్చాయి. ఫలితంగా ఇకపై రాజధాని నిర్మాణ పనులు, పురోగతిపై ఈ కార్యాలయాల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండబోతోంది. ఈ కారణంగా పనుల్లో వేగం మరింత పెరగనుంది.

భూ సమీకరణ అడ్డంకులు తొలగడంతో..

రాజధాని కోసం 33,800 ఎకరాల భూములు సమీకరించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం భావించగా, ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు గ్రామాల్లో కొంతమంది రైతులు నిరాకరించారు. ఆ కారణంగా సుమారు 3 వేల ఎకరాల భూమి సమీకరణలోకి రాకుండా ఆగిపోయింది. తాజాగా కొందరు రైతులు భూ సమీకరణకు ముందుకు రావడంతో దాదాపు 350 ఎకరాల భూమిని ప్రభుత్వం సమీకరించగలిగింది. మిగిలిన రైతుల్లో కూడా సానుకూల స్పందన కనిపిస్తుండడంతో ఆ సమస్యకు కూడా త్వరలో పరిష్కారం లభించే అవకాశం కనిపిస్తోంది. రైతులు భూములివ్వడానికి ముందుకు రావడంతో గతంలో ఆగిపోయిన పనులు వేగం పుంజుకున్నాయి. ఉండవల్లి, పెనుమాక రైతులు భూసమీకరణకు అంగీకరించడంతో గతంలో వెంకటపాలెంలోని మంతెన సత్యనారాయణ ఆశ్రమం వరకూ వచ్చి ఆగిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం వేగం పుంజుకుంది. ఎన్‌హెచ్ 16పై ఉన్న కనకదుర్గమ్మ వారధి వరకూ విస్తరించేందుకు మార్గం సుగమమయింది. ఇప్పటికే చాలా వరకూ పనులు మొదలయ్యాయి కూడా.

తర్వాత ప్రారంభమయ్యేది ఐఏఎస్ అపార్ట్‌మెంట్లే

రాజధాని నిర్మాణంలో భాగంగా ఇప్పటికే సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభం కాగా, త్వరలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు ప్రారంభమవుతాయని తెలుస్తోంది. అదే జరిగితే తొలిగా ప్రారంభమయ్యే ప్రభుత్వాధికారుల నివాసాలు ఇవే అని చెప్పాలి. వీటికి సంబంధించి బయటివైపు పనులన్నీ పూర్తయ్యాయి. ఇంటీరియర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వాటితో పాటు ప్రజాప్రతినిధుల భవన సముదాయాలైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అపార్ట్‌మెంట్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు తుది మెరుగులు దిద్దుతుండగా, ఎమ్మెల్సీ క్వార్టర్స్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శుల, కార్యదర్శుల భవనాల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. ఇప్పటికే కొన్ని భవనాలు తుది మెరుగులు దిద్దుకుంటుండగా, మరికొన్ని భవనాల నిర్మాణం వేగం పుంజుకుంది. హైకోర్టు న్యాయమూర్తుల గృహ సముదాయం, మంత్రుల గృహసముదాయం పనుల్లో కూడా పురోగతి కనిపిస్తోంది.

అత్యంత వేగంగా మౌలిక సదుపాయాల కల్పన

రాజధానిలో ప్రతిష్టాత్మక సంస్థలు అడుగుపెడుతున్న నేపథ్యంలో సీఆర్డీఏ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టింది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తొలి ప్రాధాన్యంగా రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. రహదారుల నిర్మాణంలో భాగంగా వాటర్ లైన్, మురుగు, వరద నీటి డ్రైన్, అండర్ గ్రౌండ్ విద్యుత్, కమ్యూనికేషన్ లైన్ల కోసం ఏర్పాటు చేసే యుటిలిటీ డక్టుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులకు వర్షాలు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలోనే పనులు జరుగుతుండడం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి

రాజధాని కోసం భూములిచ్చిన రైతుల రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు. ఇటీవల సీఆర్డీఏ కార్యాలయ ప్రారంభ సమయంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశమై అదే విషయాన్ని నొక్కి చెప్పారు. 'మీ త్యాగం మర్చిపోను. త్యాగమూర్తులకు రెట్టింపు గౌరవ మర్యాదలు, ఆదాయం వచ్చేలా చేస్తానని' ముఖ్యమంత్రి వారికి మాటిచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఆర్డీఏ తాజాగా రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించింది. రాజధాని గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో అంతర్గత రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ పనులు కూడా పూర్తయి రైతులకు ప్లాట్లు దక్కితే, అక్కడ కూడా నిర్మాణాలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మొదలైతే రాజధాని నిర్మాణాన్ని ఆపడం ఎవరి తరం కాదని రైతులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండడం పట్ల రాజధాని ప్రాంత వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రైతుల ముఖాల్లో ఆనందం చిగురిస్తోంది.


బయటి పనులు పూర్తైన ఎమ్మెల్యే క్వార్టర్స్


తుది దశకు చేరిన ప్రధాన కార్యదర్శుల నివాసాలు

రజక కల్యాణ మండపానికి 100 కుర్చీల బహూకరణ


కుర్చీలు అందజేసిన రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో నిర్మించిన చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు 100 కుర్చీలను బహూకరించారు. ఆదివారం కల్యాణ మండప నిర్వహణ కమిటి కన్వీనర్ వల్లభాపురం వెంకటేశ్వరరావుకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నియోజవర్గ పరిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల ఏర్పాటు, వివిధ సామాజిక కమ్యూనిటి హాల్స్‌కు కుర్చీలు తదితరాలు బహూకరించడం ప్రకృతి వైపరీత్యాలప్పుడు రోటరీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, మున్నంగి వివేకానందరెడ్డి, జొన్నా రాజేశ్, రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొజ్జా సుబ్బారావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఓలేటి శ్రీనివాసరావు, ఉండవల్లి పార్థసారధి, మునిపల్లి సాంబశివరావు, వెంకటేశ్వర్లు, చెంచయ్య, శివయ్య, మస్తాన్‌రావు, పాల్గొన్నారు.

ముత్యాలరావు సేవలు మరువలేనివి : సీపీఎం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ నాయకుడిగా ప్రజా జీవితంలో తన ప్రస్థానం మొదలుపెట్టి వ్యవసాయ కార్మిక సంఘం, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఇతర ప్రజా సంఘాలలో రాణించిన సోలా ముత్యాలరావు సేవలు మరువలేనివని సీపీఎం సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మేకా అమరారెడ్డి భవన్‌లో సోలా ముత్యాలరావు ప్రథమ వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, గాదె సుబ్బారెడ్డి, విజయబాబు, డీవీ భాస్కరరెడ్డి, బాబ్జి, బాషా, కరుణాకర్, మేరి, శ్రీనివాసరెడ్డి, గోపాలరెడ్డి, బాబూరావు, దశరథరామిరెడ్డి, నారిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ అనుభవంపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో ఏరువాక కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల ఎరువుతో ట్రైకోడెర్మ విరిడి కలిపి కల్చర్ ఎలా తయారు చేయాలో రైతులకు వివరించారు. ఈ మిశ్రమాన్ని పొలంలో చల్లితే పంటలలో తెగుళ్ళను నివారించవచ్చని, భూసారం పెరుగుదలతో పాటు సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి, గ్రామస్థులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

266 మందికి కంటి వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జాగృతి

పెదనందిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోకా పాఠశాలలో సాయి మందిర్ కమిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు సంయుక్తంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సహకారంతో ఆదివారం 28వ ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యురాలు జాగృతి 266 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 129 మందిని శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారిని ఈ నెల 21,22వ తేదీల్లో ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, సాయిమందిర్ కమిటీ అధ్యక్షుడు దాసరి లక్ష్మీశివరాంప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ, రోటరీ క్లబ్ ద్వారా ఈ ప్రాంతంలో పేదలకు వైద్య సేవలతో పాటు విద్యార్థులకు చేయూతనందిస్తూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయడం అభినందనీయమన్నారు. రోగులకు అశోకా పాఠశాల స్కౌట్ విద్యార్థులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి వీర రాఘవయ్య, జిల్లా చైర్మన్లు పోపూరి లక్ష్మీనారాయణ, కొల్లా సాంబశివరావు (నవత), మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్నం శ్రీనివాసరావు, పోపూరి నాగేశ్వరరావు, కోశాధికారి కోడూరి నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు గూడూరి వీరయ్య చౌదరి, సభ్యులు నల్లపునేని శివప్రసాద్ పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుం చి పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు ఆదివారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడు గుల నీటిమట్టం ఉండగా దిగువకు 43,500 క్యూసెక్కులనీరు విడుదల చేస్తు న్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 216 క్యూసెక్కుల నీరు, రేపల్లెకాల్వకు 1526 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 563 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 118 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 281 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2800 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

దీపావళి వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ


బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఎస్ఐ మధుపవన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆదివారం పరిశీలించి, దుకాణదారులకు తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపినా, నివాస ప్రాంతాల్లో దుకాణాలు పెట్టి అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే తక్షణమే డయల్ 112, 101, 9440900872కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పొదుపుమొత్తాన్ని స్వాహా చేశారంటూ వృద్ధురాలి ఫిర్యాదు

దుగ్గిరాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ చిన్నమొత్తాల పొదుపు పథకం కింద ఐదేళ్లపాటు పోస్టాఫీసులో పొదుపు చేసుకున్న మొత్తాన్ని ఓపోస్టల్ ఉద్యోగి స్వాహా చేశాడంటూ దుగ్గిరాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఓవృద్ధురాలు ఆదివారం ఫిర్యాదు చేసింది. చిలువూరుకు చెందిన బాధితురాలు చిలువూరు అవ్వమ్మ 2018 నుంచి 2023 వరకూ గ్రామంలోని సబ్‌పోస్టాఫీసులో నెలకు రూ.2వేల చొప్పున పొదుపు చేసుకుంది. అదేవిధంగా పోస్టాఫీసులో పనిచేస్తున్న ఓఉద్యోగికి నెలనెలా చెల్లిస్తూ వచ్చానని, పుస్తకం కూడా తనవద్దనే దాచుకునన్నాడని తెలిపింది. నిర్ణీత కాలం పూర్తయ్యాక పోస్టాఫీసుకు వెళ్లి అధికారులను కలిసి తన పొదుపు మొత్తం ఇవ్వాలని కోరగా, తమవద్ద పాస్‌పుస్తకం లేదని, రూ.1.50 లక్షలు చెల్లిస్తామని, లేదంటే నకిలీ పాస్‌పుస్తకం ఇస్తామని చెప్పారని తెలిపింది. నకిలీ పుస్తకం కోసం దరఖాస్తు చేయగా తన పేరిట ఖాతా తెరవలేదని అధికారులు చెప్పడంతో మోసపోయానని తెలుసుకున్నానని, న్యాయం జరిగేలా చూడాలని ఫిర్యాదులో కోరింది.

అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ

కాకుమాను, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకండా బాణసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ ఆదివారం తెలిపారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖ అధికారుల నుంచి అనుమతులు ఉంటేనే బాణసంచా విక్రయాలు జరుపుకోవాలన్నారు. ఎవరైన నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


దీపావళిని పురస్కరించుకుని మంగళగిరికి చెందిన హేమలత ఆయిల్ మిల్లు వారి సౌజన్యంతో చినకాకాని షైన్ అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న బాలలకు ఆదివారం టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా రూ.50వేల విలువైన టపాసులను పంపిణీ చేస్తున్న దృశ్యం
(మంగళగిరిసిటీ, ఆంధ్రజ్యోతి)